క్లుప్తంగా

'సుంకేసుల'కు 4,100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి ఆదివారం 4,100 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. డ్యామ్ చెందిన ఒక గేట్‌ను అర మీటరు మేర ఎత్తి 2,264 క్యూ సెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కేసీ కాల్వకు 1,616 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యామ్ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం డ్యామ్‌లో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నేడు పంచాయతీలలో గ్రామ సభలు

సి.బెళగల్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు (పీఎస్‌లు) సోమవారం గ్రామ సభలను తప్పకుండ నిర్వహించాలని ఈఓఆర్డీ సందీప్ ఆదివారం ఆయన ప్రకటనలో సూచించారు. గాంధీ జయంతి సందర్భంగా ప్రత్యేక పంచాయతీరాజ్ కార్యక్రమాలలో భాగంగా గ్రామ సభలను పీఎస్‌లు నిర్వహించాలన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన, గ్రామ వార్డు సభ్యులు గ్రామ సభలను నిర్వహించాలన్నారు. తమ కార్యాలయ ఆవరణంలోని గాంధీ విగ్రహం వద్ద కార్యక్రమంను నిర్వహిస్తామని, మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, రెవెన్యూ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

కొత్తూరు సుబ్బరాయుడికి వెండినాగపడిగె వితరణ


స్వామివారికి వెండినాగా భరణాన్ని అందిస్తున్న భక్తులు

పాణ్యం: మండల పరిధిలోని ఎస్ కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వెండి నాగాభరణం అందించినట్లు ఈఓ రామక్రిష్ణ ఆదివారం తెలిపారు. నంద్యాల పట్టణం డానియేల్‌పురానికి చెందిన ఉమాశంకర్, నరేష్‌కుమార్ కుటుంబసభ్యులు స్వామివారు ఇంటి ఇలవేల్పు కావడంతో 580 గ్రాముల వెండి నాగపడిగెను అందజేశారు. వీరికి ఆలయ మర్యాదలతో సన్మానం చేశారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అర్చకులు నారాయణస్వామి పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనండి

పాణ్యం: ఆర్‌జీయుం కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 5,6వ తేదిల్లో జేఎన్‌టీయూ కళాశాల స్థాయిలో ఫుట్‌బాల్‌లీగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయచంద్ర ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు ఆయా కళాశాల గుర్తింపు కార్డులతో పాటు, వ్యక్తిగత బోనఫైడ్ సర్టిఫికెట్‌ను తీసుకురావాలన్నారు. పాటీల్లో పాల్గొనేవారు 17 నుంచి 25 ఏళ్లలోపు ఉండాలన్నారు.

మోడల్ ఫిష్ మార్కెట్‌కు స్థలం కేటాయించాలి

కల్లూరు: కర్నూలు నగరంలో మోడల్ ఫిష్ మార్కెట్‌కు స్థలం కేటాయించి స్మాల్ ఫిష్ రిటైల్ మార్కెట్లు ఏర్పాటు చేయాలని ఏపీ సంప్రదాయ మత్స్యకారుల సంక్షేమ సంఘం (తెలుగు-బెస్త-గంగపుత్ర) కర్నూలు నగరం సభ్యులు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి తన కార్యాలయంలో వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ శివశ్యామల కుమారి, గౌరవ అధ్యక్షులు ఉండవల్లి వెంకటన్న, అధ్యక్షులు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు సురేష్, సభ్యులు పాల్గొన్నారు.

ఎల్‌ఎల్‌సీకి నీరు విడుదల

సి.బెళగల్: సి.బెళగల్ మండలంలోని పంట పొలాలకు ఎల్‌ఎల్‌సీ కాలువకు నీటిని జిల్లా ఇరిగేషన్ అధికారులు విడుదల చేశారు. పంటలకు సాగునీరు అందించాలన్న బురాన్‌దొడ్డి గ్రామ పంచాయతీ రైతుల కొరిక మేరకు జిల్లా ఇరిగేషన్ అధికారులు స్పందించి నీరు విడుదల చేయడంతో ఆదివారం బురాన్‌దొడ్డి గ్రామ పంచాయతీ చేరాయి. పొలాలకు సాగునీరు రావడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. గుండ్రేవుల మేయిన్ కాలువ ద్వారా మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి, క్రిష్ణదొడ్డి, మారందొడ్డి, బ్యాతోలి, బురాన్‌దొడ్డి గ్రామాలకు సాగునీరు సరఫరా కావడంతో ఏఈ సూర్యప్రకాష్, రైతులు శరత్‌కుమార్, గోవిందు, ఓబులేష్, రామాంజినేయులు తదితరులు పరిశీలించారు. ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, ఈఈ శైలేశ్వర్, డీఈ సుబ్బారాయుడు తదితర అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల (2004-2005 పదిబ్యాచ్) సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఏళ్ల తర్వాత కలిసిన స్నేహితులు ఆప్యాయంగా పలుకరించుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి

• జిల్లా కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే డా.సుధాకర్

కోడుమూరు రూరల్ : ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతో పాటు పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని, ఆరోగ్యంగా జీవించాలని జిల్లా కలెక్టర్ సృజన సూచించారు. ఆదివారం కోడుమూరులో 'స్వచ్ఛతాహి సేవా' కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సృజన, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి నిర్వహించారు. చీపురులు పట్టి వీధులను శుభ్రం చేశారు. అదేవిధంగా పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి మహాత్ముడికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సృజన మాట్లాడుతూ ప్రజలంతా కలిసికట్టుగా పని చేసి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రజలంతా ఇంట్లోని చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా చెత్తసేకరణ వాహనాల్లో వేసి సహకరించాలన్నారు. ప్రజలంతా స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని ఒక ఉద్యమం లాగా ముందుకు తీసుకెళ్లాలని, పారిశుద్ధ్య నిర్వహణ కేవలం పారిశుద్ధ్య కార్మికులది, కార్యదర్శులది మాత్రమే కాదని ప్రజలందరిదని కలెక్టర్ సూచించారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులను ప్రజలు గౌరవించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు వారి ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా ప్రజల ఆరోగ్యం కోసం అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను స్వచ్ఛంగా ఉంచేందుకు అవసరమైన చర్యలను చేపడుతోందని, పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ కోసం వాహనాలను ఏర్పాటు చేయించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ గాడి రూతమ్మ, సర్పంచ్ భాగ్యరత్నమ్మ, డీపీఓ నాగరాజునాయుడు, డీఎల్‌పీఓ తిమ్మక్క, తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, డీఈఈ ఏడుకొండలు, ఈఓఆర్డీ మంజుల, ఏఈ ప్రసాద్, ఈఓ అజయ్‌భాస్కర్, స్థానిక వైసీపీ నేతలు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటరీలు, ప్రజలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన


పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే డా.సుధాకర్

పరిశుభ్రత మనందరి బాధ్యత

సి.బెళగల్: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. ఆదివారం మండల కేంద్రం సి.బెళగల్‌లోని బస్టాండ్ ఆవరణంలో స్వచ్ఛ తాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్‌లు ఏక్ తారీక్ - ఏక్ గంట - ఏక్ సాత్ కార్యక్రమంను నిర్వహించారు. ఎంపీపీ బొంతల మునెప్ప, స్థానిక సర్పంచ్ పాండురంగన్న పరిశుభ్రత అంశాలను ప్రజలకు వివరించారు. అనంతరం మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు బస్టాండ్‌లో శ్రమదానంలో భాగంగా చీపుర్లను ఉపయోగించి ఆవరణంలో చెత్తను శుభ్రం చేసి, ట్రాక్టర్‌లో తరలించారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, తదితరులు స్వయంగా చెత్తను తొలగించారు. అదేవిధంగా బురాన్‌దొడ్డి గ్రామంలో పారిశుద్ధ్య కూలీలు ఏలియా, మాదవరావు, దేవరాజు తదితరులను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు,, సచివాలయ ఉద్యోగులు, వలటంటీర్లు శాలువాలు కప్పి, పూలమాలలో ఘనంగా సన్మానించారు.

గూడూరు: పట్టణంలో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు ఆదివారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. విద్యార్థులతో కలిసి ప్రజాప్రతినిధులు, అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు. వ్యక్తిగతంతోపాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఈసందర్భంగా చైర్మన్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, కౌన్సిలర్లు, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.


సి.బెళగల్ బస్టాండ్ ఆవరణను శుభ్రం చేస్తున్న ఎంపీపీ బొంతల మునెప్ప, సర్పంచ్ పాండురంగన్న, అధికారులు


పట్టణంలో శ్రమదానం చేస్తున్న దృశ్యం

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోండి


బిలకలగూడూరులో రోడ్లను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నాయకులు

గడివేముల : ప్రతి పరిశుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కోరారు. ఆదివారం స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా బిలకలగూడూరు గ్రామంలో రోడ్లను శుభ్రం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే చీపురు పట్టుకుని రోడ్డుపై చెత్తచెదారాన్ని ఊడ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు శివరామిరెడ్డి, సర్పంచ్ నారాయణ, ఎంపీటీసీ రామస్వామి,ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, ఏఈలు మూర్తి ,భాస్కర్, పవన్,వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, మేఘనాథరెడ్డి, రవీంద్రారెడ్డి, రాము,రాంభూపాల్‌రెడ్డి, రఘుమాధవ రెడ్డి,సర్వేశ్‌రెడ్డి,శ్రీకాంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి,సచివాలయ ఉద్యోగులు,వలంటీర్లు పాల్గొన్నారు.

పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

కల్లూరు: సమాజంలో అందరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని ఎంపీపీ బోయ శారద పిలుపునిచ్చారు. ఆదివారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా సల్కాపురం గ్రామంలో ఎంపీపీ, చిన్నటేకూరు గ్రామంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి పాల్గొన్ని వీధుల్లో చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఎంపీడీఓ మాట్లాడుతూ ఇంటితో ఇంటి చుట్టు పరిసవరాలను పరిశుభ్రంగా ఉన్నపుడే అందరం ఆరోగ్యంగా ఉంటమన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిషోర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెద్ద ఈశ్వరయ్య, సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి, చిన్నటేకూరు సర్పంచ్ లక్ష్మన్న, పంచాయతీ కార్యదర్శులు, గ్రామీణ నీటి పారుదల శాఖ సిబ్బంది, వలంటీర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


చెత్తను నిర్మూలిద్దాం అంటూ ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

- లక్ష్మీపురం కేజీబీవీ (మైనార్టీ) పాఠశాల విద్యార్థినులు ప్రిన్సిపల్ ఉమాదేవి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. చేయి చేయి కలుపుద్దాం చెత్తను నిర్మూలిద్దాం అంటూ నినాదాలు చేశారు. పాఠశాలలో తరగతి గదులను, పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు.
- పర్ల గ్రామంలో సర్పంచ్ హనుమక్క ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. గ్రామంలో వీధులన్ని చీపురు పట్టుకుని ఊడ్చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.
- కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీజేపీ నాయకులు కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు.
- 21 వార్డు లేపాక్షి నగర్‌లో స్వచ్ఛత హీ కార్యక్రమంలో వార్డు నాయకులు బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు.


మురుగు కాల్వను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

పరిసరాల పరిశుభ్రత..ఆరోగ్యం భద్రత

ఓర్వకల్లు: ప్రజల ఆరోగ్యం భద్రంగా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు అన్నారు. 'స్వచ్ఛత హీ సేవా' కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాలలో ర్యాలీలు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఓర్వకల్లులో ఈఓఆర్‌డీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రంగనాథ్‌గౌడుతో పాటు, గ్రామ ఉప సర్పంచు రామేశ్వరమ్మ, ఏపీఎం వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ర్యాలీ చేపట్టి గ్రామ వీధుల్లో అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక మర్రిచెట్టు ప్రాంతంలో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పాణ్యం: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పాణ్యం మండలంలోని గ్రామాల్లో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కొండజుటూరు గ్రామ సర్పంచ్ సుజితంరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

- ఎంపీపీ ఉసేన్‌బీ, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, కో- ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్,లతో పాటు వార్డు సభ్యులు ఆధ్వర్యంలో పాణ్యం పోలీసు స్టేషన్ వద్ద స్వచ్ఛతే హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. మైదానంలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు.


కొండజుటూరులో ర్యాలీలో పాల్గొన్న మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి

నేడు నూతన భవనాల ప్రారంభోత్సవం



సి.బెళగల్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధమైన గ్రామ సచివాలయం, ఆర్బీకే భవనాలు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో నూతన ప్రభుత్వ భవనాలను సోమవారం ప్రారంభించడం జరుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రూ.40 లక్షలతో నిర్మించిన సి.బెళగల్ గ్రామ సచివాలయ - 2 భవనం, అదేవిధంగా రూ.21.80 లక్షలతో మండల కాంప్లెక్స్ ఆవరణలో నిర్మించిన ఆర్బీకే - 2 భవనాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తారని, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని ఎంపీపీ బొంతల మునెప్ప కోరారు.

మండలంలో ఠంచన్‌గా పింఛన్ల పంపిణీ


కర్నూలు ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వృద్ధురాలు క్రిష్ణాభాయికి పింఛన్ అందజేస్తున్న పీఎస్ జనార్దన్, వలంటీర్ రమేష్

కోడుమూరు రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుకలో భాగంగా ఆదివారం మండలంలో లబ్ధిదారులందరికీ వలంటరీలు పింఛన్లు అందజేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చారు. కోడుమూరు మండలంలో 9197పింఛన్లు ఉండగా ఆదివారం సాయంత్రానికి 6776 మంది లబ్ధిదారులకు వలంటర్లు పింఛన్ల సొమ్మును అందజేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ చెప్పారు. అనారోగ్యంతో కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కోడుమూరుకు చెందిన క్రిష్ణాభాయి అనే వృద్ధురాలికి గ్రామ సచివాలయం-3 పీఎస్ జనార్దన్, వలంటరీ రమేష్ వెళ్లి వేలిముద్ర తీసుకుని వృద్ధాప్య పింఛన్ సొమ్ము అందజేశారు.

గడివేముల: వృద్ధులు,వితంతువులు,దివ్యాంగులు తదితర పింఛన్లను ఆదివారం వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నగదు అందజేశారు. గడివేముల మండలంలోని 14 సచివాలయాల పరిధిలో సూర్యోదయానికి ముందే లబ్ధిదారులకు వేలిముద్రలు సేకరించి డబ్బులను అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలో 5858 పింఛన్లకు గాను 4303 మందికి పంపిణీ చేసి 73.46 శాతం పూర్తి చేశామని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు.

కల్లూరు: పింఛన్ లబ్ధిదారులకు వలంటీర్లు ఆదివారం ఠంచన్‌గా అందజేశారు. వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు వలంటీర్లు ఉదయం నుంచి ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. మండలంలో 8,434 మంది పింఛన్లు దారులు ఉండగా మొదటిరోజునే 5,891 (70శాతం) మందికి పంపిణీ చేశారు.

రాష్ట్రంలో జనరంజక పాలన

• ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


బిలకలగూడూరు గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమపథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

గడివేముల: సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జనరంజక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెలే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో రెండో రోజు గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చిన పలు సమస్యలను పరిష్కరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామంలో రోడ్లు,డ్రైనేజీ,విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పలువురు దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వ పాలనలో పేద ప్రజలకు ఇంత లబ్ధి చేకూరలేదని, గత నాలుగేళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరిందన్నారు. అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు అందడంలో జాప్యం జరిగితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. ఓర్వలేని ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తూ తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రతిపక్షాల ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పారదర్శక పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి, వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఈ సందర్భంగా కాటసాని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి,సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి,పార్టీ మండలాధ్యక్షుడు శివరామిరెడ్డి,సర్పంచ్ నారాయణ,ఎంపీటీసీ రామస్వామి,ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప,ఏఈలు మూర్తి,భాస్కర్, పవన్,వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, మేఘనాథరెడ్డి, రవీంద్రారెడ్డి, రాము,రాంభూపాల్‌రెడ్డి, రఘుమాధవరెడ్డి,సర్వేశ్‌రెడ్డి,శ్రీకాంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి,సచివాలయ ఉద్యోగులు,వలంటీర్లు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే ధ్యేయంగా పాలన

కల్లూరు: రైతుల అభివృద్ధి ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురం గ్రామంలో రైతులకు సబ్సిడీపై శనగ జేజీ-11 రకం విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల అభిప్రాయం మేరకు ఈ ఏడాది రబీ సిజన్‌లో శనగ రాయితీ విత్తనాలను పెంచమన్నారు. మండల వ్యాప్తంగా 3,620 క్వింళ్లు గత ఏడాది 25శాతం సబ్సిడీ అందించగా ఈ సారి 40 శాతానికి పెంచమన్నారు. క్వింటాం ధర రూ. 8,100 ఉండగా 40శాతం సబ్సిడీ పోను రైతులు రూ. 4,860 చెల్లించాలన్నారు. ఎకరాకు 40 కిలోల శగన విత్తనాలు అందిస్తున్నామన్నారు. విత్తనాలు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వీఏఏ/వీహెచ్‌ఏలను కలసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.


రైతులకు సబ్సిడీ శనగ విత్తనాల బ్యాగ్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

పంట నమోదు తప్పనిసరి:

సాగు చేసిన పంటను తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రైతులకు సూచించారు. పంట నమోదుతో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం, సున్నావడ్డీ రుణాలు, పంట కొనుగోలు మొదలగు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. గత ఏడాది పంట నమోదు చేసుకున్న రైతులకు పంట నష్టం, ఇన్‌పుట్ సబ్సిడీ కింద మండల వ్యాప్తంగా సుమారుగా రూ. 13కోట్లు అందించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నారాయణరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, నాయకులు సత్యంరెడ్డి, మాజీ సర్పంచ్ బాబు, నడిపెన్న, కృపానందం, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం

• ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

గూడూరు రూరల్: గ్రామాల అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. పెంచికలపాడులో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు ఆదివారం ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని గ్రామీణ ప్రాంతాల రహదారులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో తీర్చిదిద్దారన్నారు. ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యాన్ని కల్పించామన్నారు. సచివాలయ నిధులతో కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు వంటి పనులను చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచు లతమ్మ, ఎల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, డిష్ వెంకటేష్, సుంకన్న, రాముడు, మగ్బుల్, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.


పెంచికలపాడులో రోడ్డు ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

రైతులకు శనగలు పంపిణీ

గుడిపాడులోని ఆర్‌బీకే కేంద్రంలో రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాలను ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పంపిణీ చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా పంట నష్ట పరిహారాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం అందించి రైతులను ఆదుకుంటుందన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలు, ప్రథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యానికి నాంది

సి.బెళగల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలలో సచివాలయాలను ఏర్పాటు చేసి మహాత్మగాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యంకు నాంది పలికారని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. ఆదివారం సి.బెళగల్ మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయం, రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనాలను ఎంపీపీ బొంతల మునెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ప్రారంభించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆర్బీకేలో ఏర్పాటు చేసిన కీయోస్క్ పనితీరును ఎమ్మెల్యేకు ఏఓ మల్లేష్‌కుమార్ వివరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో నూతనంగా ఏర్పాటైన రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే)లతో రైతుల ముంగిటకే వ్యవసాయ సేవలు చేరాయని అన్నారు. ఆర్బీకేల ద్వారా అందుతున్న వ్యవసాయ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ కుటుంబం రాష్ట్ర ప్రజల క్షేమం కృషి చేస్తూనే ఉందని, ప్రజా శ్రేయస్సు కోరుతూ ఆనాడు దివంగతనేత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 108, ఆరోగ్య సేవలను తీసువస్తే టీడీపీ ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసిందని ఆయన విమర్శించారు. నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని పటిష్టంచేసి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, ఏఈఓ సిద్దు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, వీఆర్వో పాండురంగయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉన్నారు.


బురాన్‌దొడ్డి ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్